# చీకటి

కృష్ణమూర్తికి నెలరోజుల క్రితం వరకూ రంగు రంగుల పువ్వులంటే ఇష్టం. చామంతి పువ్వులంటే ఇంకా ఇష్టం. కాని ఇవాల్టికి సరిగ్గా రెండు నెలల క్రితం అతను మనస్ఫూర్తిగా ప్రేమించిన మంజరి వాళ్ళ డాబా ఎక్కి గోడవతల వున్న ఛామంతి పూవు కోస్తూ కాలు జారి ఛెళ్ళున క్రింద పడ్డంతో ఆమెకి ఒక కాలు విరిగిపోయింది. ఆమె సగం కోసిన చామంతి పూవు కూడా సగం విరిగి అలాగే గోలేనికి వేలాడుతూ వుండిపోయింది. తను అంతగా ప్రేమించిన మంజరి కాలు విరిగి పోవడానికి కారణమైనందుకు కృష్ణమూర్తికి చామంతి పువ్వుమీద చాలా కోపం వచ్చింది. చివరికి అది అయిష్టంగా మారి, అసహ్యంగా స్థిరపడి పోయింది.

అందువల్ల ఇప్పుడతనికి చీకటంటేనే ఇష్టం.

* * * *

చాలా మందికి చీకటంటే ఇష్టం ఉండదు. చీకటిని చెదరించు కుంటూ తరిమి కొట్టడానికి వాళ్ళంతా ప్రయత్నిస్తారు. కాని కృష్ణమూర్తికి చీకటంటే ఇష్టం యేర్పడ్డానికి కారణాలున్నాయి.

కారణం లేకుండానే మనకి కొందరు మనుషులన్నా, కొన్ని వస్తువులన్నా ఇష్టం ఏర్పడుతుంది. దీన్ని ఒక రకమైన సైకాలాజికల్ ట్రెండ్ అనొచ్చు. అలాగే అతనికి కూడా కారణం లేకుండానే చికటి మీద ఇష్టం యేర్పడ్డం ఒక కారణమవొచ్చు.

కృష్ణమూర్తి హైస్కూల్లో చదివే రోజుల్లో, అతని దగ్గర కాఫీ కూడా డబ్బుల్లేని రోజుల్లో, వూరంతా కరెంటు పోయినప్పుడు, రోడ్డు మీద నడుస్తున్న కృష్ణమూర్తి చీకట్లో అరటిపండు తొక్కమీద కాలేసి జారి పడ్డప్పుడు, రోడ్డు మీద ఆనిన అతని చేతికి వో కాగితం దొరికిన ప్పుడు, అనుకోకుండా మళ్ళీ కరెంటు వచ్చి, ఆ కాగితం ముక్క ఐదు రూపాయల నోటని తెలిసినప్పుడు అతనికి చీకటి మీద ఇష్టం ఇంకా ఇనుమడించింది.

మరో సారి, కృష్ణమూర్తి ఎవ్వరినీ ప్రేమించనప్పుడు, దాదాపు చీకటిగా వున్న బీచ్‌లో, స్కాండల్ పాయింట్ దగ్గర, నల్లని డ్రస్సులో కూర్చుని రాబోయే పరీక్షల కోసం దీర్ఘంగా ఆలోచిస్తున్న ప్పుడు, అనుకోకుండా అతన్నెవరో వెనుకనుంచి వచ్చి గట్టిగా కౌగిలించు కున్నారు. ఆ వెంటనే అతని చెంపల్ని ముద్దు పెట్టుకుని, 'సారీ, ఫర్ ది డిలే, డార్లింగ్!" లన్నారు. అప్పుడు కృష్ణమూర్తిని మెత్తని మత్తుదనం టియారా పౌడరు వాసనతోపాటు చిత్తుగా చీకటిలా కమ్మేసింది. వెంటనే అతను చాలా గాభరాపడి విదిలించుకో (లే) కుండానే ముఖాన్ని మాత్రం పక్కకి తిప్పేడు. ఆశ్చర్యం, భయం, ఆనందం, కోపం—ఇవన్నీ కల్సిన ఫీలింగ్ అతని కళ్ళలో పరచుకుని, అతని మనసుని పగ్గాల్లేకుండా పరిగె త్తించేసింది. ఆ వెంటనే అతన్ని కౌగలించుకున్న పద్ధెండేళ్ళ పచ్చని అమ్మాయి అతన్ని వదిలేసి వెనక్కి వెళ్ళి అతని ముఖాన్ని పరీక్షగా చూసి "వో! అయాం టెరిబ్లీ సారీ" అంటూ తలవంచుకుని వెనక్కి తిరిగి మొదట జోరుగా నడిచి, ఆ తర్వాత అతి జోరుగా పరిగెత్తి వెళ్ళి పోయింది. కృష్ణమూర్తి తేరుకుని, చీకటిని తల్చు కొని చిన్నగా నవ్వుకున్నాడు. ఆ తర్వాత భయపడ్డాడు. ఇంకా ఎక్కువగా ఆశ్చర్యపోయాడు. ఆవేళ నుంచి మాత్రం అతని మనసులో చీకటి మీద చల్లని మమత అమావాస్య నాటి రాత్రి చీకటిలా ఆనందంగా అలుముకుంది.

ఎమ్మే మొదటి సంవత్సరంలో పరీక్ష వుండగా అతను ప్రేమిం చిన మంజరిని అతను మొదటిసారిగా చీకట్లోనే చూసేడు. నల్లనిచీకట్లో

తెల్లని మంజరి ఆ వేళ నవ్విన నవ్వులో వెన్నెల కురిసింది. బియ్యే చదువుతున్న మంజరి అంతకు ముందురోజే కృష్ణమూర్తి వాళ్ళ పక్కింట్లో దిగింది. ఆ తర్వాత క్రమేపీ సంధ్య వేళ పెరిగే చల్లని చీకటిలో వాళ్ళిద్దరి మధ్య ప్రేమ పెరిగింది.

ఈ విధంగా కృష్ణమూర్తికి చీకటి మీద చాలా ఇష్టం యేర్పడిపోయింది.

చదువుకోనప్పుడు అతనొక్కడూ ఇంట్లో వుంటే అతని గదిలో అతను లైటు వేసుకోకుండానే చీకట్లో కూర్చుంటాడు! అలా కూర్చోడం అతనికిష్టం. అందువల్ల అతని ముఖ్య స్నేహితుడు ముకుందం "భలే వాడివి గురూ! మా గొప్ప కరెంటెకానమీ చేస్తున్నావే. నేను సెంట్రల్ మినిస్టర్ నైతే నీకో స్పెషల్ ప్రైజిద్దును" అంటుంటాడు. అందుకు కృష్ణమూర్తి చిరుచీకటిలాటినవ్వొకటి నవ్వి వూరుకుంటాడు.నల్లనిచీకట్లో అతనికి వూహల కతీతమైన అతి కమ్మని భావాలేవో కనిపించి,కదులుతూ చీకటి చెదిరిపోగానే మాయమైపోతాయి.

* * * *

రూమంతా చీకటిగా, నల్లగా వుంది. కాని రూములో కూర్చున్న కృష్ణమూర్తి మనసు మాత్రం వెలుగంత విసుగ్గానూ, వేడిగానూ ఉంది. మంజరి గురించి అతను మతి చెదిరేట్టు ఆలోచిస్తున్నాడు. తను మనస్ఫూర్తిగా ప్రేమించిన మంజరి దగ్గిరికి మూడురోజుల క్రితం వెళ్ళేడు. వాళ్ళింట్లో అందరూ తనకి తెలుసు. మంజరీ,తనూ ప్రేమించుకున్నారని, పెళ్ళికూడా చేసుకుంటారని కూడా తెలుసు. కాని వూహల్లో నిర్మించుకున్న రంగుల మేడలు శాశ్వతం కావు. వాటి గోడలు పునాదుల్తో సహా ఎప్పుడో అప్పుడు కూలిపోక తప్పదు. ఈ నిజం కఠోరమైనదే కాని నిజం కాక తప్పదు. ఈ సంగతి వాళ్ళకి తెలుసు. కాని ఇలా జరుగుతుందని అనుకునుండరు అనుకున్నాడు కృష్ణమూర్తి.

ఇంట్లోకి వెళ్ళగానే వాళ్ళమ్మగారు కన్నీళ్ళతో అతని పక్క చూసి లోపలి గదిలోకి దారి చూపించారు. బరువుగా నడుస్తూ లోపలికి వెళ్లేడు.

లోపలి కిటికీ దగ్గరగా మంచం మీద పడుకొని కళ్ళు మూసుకొని కన్నీళ్ళు కారుస్తున్న మంజరి, అడుగుల చప్పుడు విని కళ్ళు తెరిచింది. కృష్ణమూర్తిని చూడగానే మిగిలిన ఒక్క చెత్తోనూ ముఖంమూసుకుని గట్టిగా యేడ్చేసింది.

అతనికేం చేయాలో తెలీలేదు.

దగ్గిరగా వెళ్ళి ఆమె చేతి మీద చెయ్యివేసి నీరసంగా "మంజరీ" అని పిలిచాడు.

మంజరి పలకలేదు, ఆమె కళ్ళ ముందు చీనీ సైనికుల్లా పరుచుకున్న చీకట్లు ఆమెని మాట్లాడనివ్వలేదు. యేడుపు మాత్రం ఇంకా ఎక్కువ చేసేయి.

అదే సమయానికి,మంజరిని పొరపాటున వెలిగి చీకటికన్నానల్లని కాటుక పెట్టుకుంటే చిక్కని చిమ్మ చీకటి మధ్య చిరువెన్నెల రేఖలా మెరిసే మంజరి అందమైన కళ్ళని ఇప్పుడు కన్నీళ్లు కారుస్తున్నట్టుగా చూస్తూంటే అతని కళ్ళ ముందు భయంకరమైన మెరుపు మెరిసింది. ఆ మెరుపు వెలుగులో తను వెచ్చగా వెలిగి మాడిపోతాడేమోనని భయం వేసింది. అలా అయినా బావుణ్ననిపించింది కృష్ణమూర్తికి.

ఐనా మళ్ళీ చీకటిలా పేరుకున్న బాధని భయం భయంగా తొలగించుకుని 'మంజరీ' అని మళ్ళీ పిలిచాడు కృష్ణమూర్తి.

మంజరి యేడుపు నకస్మాత్తుగా ఆపేసింది. ముఖాన్ని పక్కకి తిప్పి "వెళ్ళిపో కృష్ణా! ఎందుకొచ్చావిక్కడకి మళ్ళీ! వెళ్ళిపో. నీ ముఖం చూడలేను, మరి వెళ్ళిపో కృష్ణా! ఈ దురదృష్టవంతురాలి దగ్గిరికి మళ్ళీ

రాకు. నాకు చెయ్యి లేదు. కళ్ళున్నాయి కాని నిన్ను చూసే అదృష్టంలేదు. నా మనసు మాడి మసైపోయింది. అందుచేత వెళ్ళిపో కృష్ణా! నన్ను మర్చిపో....పూర్తిగా మర్చిపో.... లేకపోతే చచ్చిపోయేననుకో.... నా దగ్గరికి మాత్రం మరి రాకు.........!" అని చాలా జోరుగానూ, విచారంగానూ అందామె. ఆ తర్వాత యేదో అందామనుకుంది కాని అనలేకపోయింది. ఆమె కళ్ళలో నీళ్ళు ఒక్కసారిగా పొంగేయి.

కృష్ణమూర్తి వో నిముషం మౌనంగా వుండి, ఆ తర్వాత మంజరి దగ్గరగా వెళ్ళాడు. ఆమె చేతిని తీసేసి నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు."కాదు మంజరీ! నువ్వులేందే నేను బతకను–బతకలేను. నువ్వనవసరంగా బాధపడకు మంజరీ! నీక్కాలూ చెయ్యీ పోయినా ఫరవాలేదు. ఆపరేట్ చేయిద్దాం.... నీ అందమైన మనసూ, నువ్వూ నాక్కావాలి మంజరీ! నువ్వేం బాధ పడకు. నేనుండగా నీకు బాధెందుకూ?" అన్నాడు. ఆ చెయ్యి ఆపరేట్‌చేసినా తిరిగిరాదని అతనికీ,మంజరిఇంట్లోవాళ్ళకి తెలిసిపోయింది. ఐనా అలా ధైర్యం చెప్పడం అతని కర్తవ్యం అనిపించింది. ఆ తరవాత ఆమె మీద విపరీతమైన జాలికూడా వేసింది. అతను తన తలని ఆమె గుండెల మధ్యగా జార్చి ఆమె కుడి చేతి మీద తన చేతిని వేసి విరిగిన ఎడం చేతి మీదుగా రెండో చేత్తో నిమిరి, ఆమె గుండెల మీదముద్దు పెట్టుకున్నాడు.

మంజరి కదల్లేదు. మౌనంగానే యేడ్చింది. ఆమె కన్నీళ్ళు జారి కృష్ణమూర్తి బుగ్గని తాకేయి.

కృష్ణమూర్తి లేచి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని మృదువుగా తన చెంప మీద రాసుకున్నాడు.

"వెడతాను మంజరీ,పరీక్షలు దగ్గిరకొచ్చేయి, మళ్ళీ వస్తాను వెళ్ళనా మరి" అన్నాడు.

"ఊఁ" అంది మంజరి చాలా బాధగా.

కృష్ణమూర్తి మెల్లగా నడుస్తూ వెళ్ళబోయేడు. మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చి వెనక్కి తిరిగి మంజరి దగ్గిరికి వెళ్ళి జేబులోంచి ముద్దచామంతి పువ్వు తీసి ఆమెతల్లో తురిమేడు. చామంతిని చూడగానే మంజరికి చాలా ఏడుపొచ్చేసింది. మరోపక్క కృష్ణమూర్తి ప్రేమగురించి సంతోషం కూడా ఏడుపులో కలిసిపోయింది. అందువల్లామె కన్నీళ్ళు నాపుకోలేక పోయినా వెక్కిళ్ళు నాపుకొంది.

కృష్ణమూర్తికి చామంతి పువ్వులంటే ఇష్టం పోయినా, మంజరికా పువ్వంటే ఇష్టం కనక అతనెప్పుడు వెళ్ళినా ఓ ముద్దచామంతి పువ్వు తీసుకు వెళతాడు.

ఆ తరువాత 'వెళతాను మంజరీ!' అని వచ్చేసేడు కృష్ణమూర్తి. వచ్చి చీకట్లో, తన గదిలో కూర్చొని మంజరి గురించి ఆలోచించేడు. అలా ఆలోచిస్తూంటే అతనికి మంజరిమీద జాలి విపరీతంగా, అల్లప్పటి బీచ్‌లో చీకటలా పెరిగి పేరుకొంది....కాని ఆలోచనలు అంతమవ లేదు.

అలా మూడు రాత్రులు అతనలాగే - రూములో, చీకటిలో కూర్చొని, మంజరిగురించే ఆలోచించేక అతనికి అనుకోకుండానే మంజరి గురించి చాలా భయంకరమైన ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనకో రూపం రాకుండానే గదిలోకి వెలుగు వచ్చేసింది. లైటువేసిన ముకుందం కృష్ణమూర్తి దగ్గిరగా వచ్చేడు. అతని ఎదురుగా కుర్చీలో కూర్చొని - "నీకో విషయం చెప్పాలి" అన్నాడు.

కృష్ణమూర్తి అతని పక్క చూసి 'మనసేం బాపులేదు ముకుందం' అని మళ్ళీ తలొంచుకున్నాడు.

"అందుకే. అందుకేనయ్యా ఈ చెప్పడం. విను, జాగ్రత్తగావిను. నేను నిన్ననో పుస్తకం చదివేను. క్లాసుబుక్కు వానేసి అదెందుకు చదివే

వని అడక్కు. చదివేనంతే. జాగ్రత్తగా బాధపడకుండా విను. ఆ పుస్తకంలో చీకటి గురించి కథ వుంది" అని ఆగేడు ముకుందం.

కుర్చీలోంచి లేచి బుక్ షెల్ఫ్ దగ్గరగా వెళ్ళేడు. "కృష్ణా ! మీ అమ్మగారు ఈ మధ్య నీ గురించి చాలా బాధపడుతున్నారు. నువ్వు చూస్తే ఒక్కడే కొడుకువి. మీ అమ్మగార్ని చూస్తే గుండెజబ్బు మనిషి. మీ నాన్నగారు తాగుతారు. మీ చెల్లి చూస్తే అమాయకురాలు....అంచేత నువ్వు నీ మెంటాలిటీ మార్చుకోవాలి" అన్నాడు.

"ఏంవిటి నువ్వనేది ?" విసుగ్గా అడిగేడు కృష్ణమూర్తి.

"ఏంవీంలేదు. చీకటిమీద అంత మోజెందుకో నీకు ? అది మంచిది కాదు కృష్ణా ! చీకటి పెసిమిజంకి గుర్తు. చీకటిలోనే భయంకరమైన భావాలు పుడతాయి. పెసిమిజం మనసునిండా కమ్ముకుని మరి కదలనీకుండా ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ఇలా ఎప్పుడూ చీకట్లో వుండకు" అన్నాడు ముకుందం. ఇంకా ఏదో అనబోతుండగానే కృష్ణమూర్తి చెల్లెలు కాఫీ గ్లాసులతో లోపలికి వచ్చింది. ఆ అమ్మాయికి పదిహేడేళ్ళు న్నాయి. విశాలమైన కళ్ళున్నాయి. ఇష్టపడే మనసుకూడా వుంది. అందంగా వుంటుంది. కాఫీ ఇచ్చేసి బైటకి వెళ్ళిపోబోయింది కమల.

"కమ్మా !" అని పిలిచేడు కృష్ణమూర్తి.

"ఏం ?" అంటూ వెనక్కొచ్చింది కమల.

"అమ్మ ఏం చేస్తోంది ?" అనడిగేడు.

"గుళ్లోకి వెళ్ళింది."

"సరేలే వెళ్ళు."

కమల వెళ్ళిపోయేక కృష్ణమూర్తి లేచి నిలబడ్డాడు. సిగరెట్టు జేబులోంచి తీసి వెలిగించి ముకుందాన్నడక్కుండానే లైటు ఆర్పేసేడు. మళ్ళీ కుర్చీ దగ్గిరకొచ్చి ముకుందానికో సిగరెట్టిచ్చి – "ఊం చెప్పు" అన్నాడు.

"ఇంకేవిఁటి చెప్పడం? అంతే నీ మెంటాలిటీ మార్చుకోవాలి. చీకటిని పూజిస్తూ కూర్చోడం మానెయ్యాలి. ఇటీజ్ వెరీ ఆపుల్ మైడియర్. ప్లీజ్ ఒబ్లైజ్" అన్నాడు.

ముకుందం ఓ నిముషం ఆగి "మీ అమ్మగారు చూసేవా? ఆవిడ గుండెల్లో పెరిగిపోయిన బాధ గురించి నీకు తెలీదు. నాకు తెలుసు కృష్ణా....ఆవిడ బాధంతా నాతో చెప్పేరు" అన్నాడు.

"ఔను. నాకూ చెప్పేరు....సిల్లీ....కొందరి మెంటాలిటీలు కొందరికి నచ్చవ్ అంతే. మరి నన్ను విసిగించకు. నీకు వెన్నెల పచ్చని పసిడి ఛాయలా కనిపిస్తే నాకు, పొరబాటున పచ్చబడిపోయిన పండు చీకటి ముక్కలా కనబడుతుంది....అంతే....డోంట్ బి ఛైల్డిష్" అన్నాడు కృష్ణమూర్తి.

ముకుందం మాట్లాడలేదు.

* * * *

'ఎకనామిక్స్' పుస్తకం మూసి అప్పుడే లైటార్పి చీకట్లో కూర్చొని చీకటి గురించి ఆలోచిస్తున్న కృష్ణమూర్తి గదిలోకి ఎవరో కంగారుగా వచ్చేరు. 'కృష్ణమూర్తిగారూ! అర్జంటుగా రండి! అక్క.... అక్క విషం పుచ్చుకుంది....' అని కంగారుగా అన్నారు.

చీకట్లో చిక్కుపడిపోయిన కృష్ణమూర్తికి మొదట ఏఁవీఁ అర్థమవలేదు. అలా అన్న కుర్రవాడు మంజరి తమ్ముడని మొదట అర్థమైంది. ఆ తరువాత విషయం అర్థమవగానే గుండెల్లో అగ్ని పర్వతాలు పగిలేయి. బైటికి పరిగెత్తేడు.

రోడ్డుమీద లైట్లులేవు. మంజరీ వాళ్ళింట్లో కూడా కరెంటు లేదు. అతను మంజరి గదిలోకి పరిగెత్తేడు. అక్కడ అంత చీకటిగాలేదు. చీకట్లో చిరువెలుగునిస్తూ, మంజరి తల దగ్గర ఓ కొవ్వొత్తి వెలుగుతోంది. ఆమె మంచం దగ్గర వాళ్ళమ్మగారు కూచొని వున్నారు. ఆమె

ఎందుచేతనోగాని ఏడవటం లేదు. ఆమె చుట్టూ మరెవరో నలుగురైదు గురు ఏడుస్తూ వున్నారు. కొవ్వొత్తి వెలుగులో మంజరి వాళ్ళమ్మగారి ముఖం మొదట చూసేడు కృష్ణమూర్తి. ఆవిడ కళ్ళు ఎటు చూస్తున్నాయో తెలీటంలేదు - ఆవిడ కళ్ళ క్రిందుగా కన్నీటిచారలు స్పష్టంగా కనబడు తున్నాయి. ఆవిడ జుత్తురేగి చీకటి తుంపర్లలాగ చీలిపోయి భయం కరంగా వుంది....ఆవిడ మాట పడిపోయినట్టు, మనసు పడిపోయినట్టూ వుంది. ప్రాణంపోయిన తరవాత కృత్రిమంగా ప్రాణం పోసిన మనిషి లాగ ఆవిడ చాలా భయంకరంగా వుంది....

ఆ తర్వాత కన్నీళ్ళపొర వెనకనించి మంజరి ముఖంవేపు చూసేడు కృష్ణమూర్తి. కొవ్వొత్తి వెలుగు వెల్తిగా మంజరి ముఖంమీద పడుతోంది. ఒక పక్క నీడ, మరోపక్క వెలుగు ఆమె ముఖంలోచోటు చేసుకున్నాయి. ఎందుకోగాని ఆమె ముఖం ప్రశాంతంగా, తన ప్రాణం పోవడంవల్ల మిగతా మనుషులందరికీ మేలు చేస్తుందని తెలిసి ప్రాణ త్యాగం చేసిన త్యాగమూర్తి ముఖంలా వుంది.

కృష్ణమూర్తిని ఏదో మగతలాటి భావం కమ్మేసింది. అనుకో కుండానే కన్నీళ్ళొచ్చేయి. ఏమీ మాట్లాడలేక పోయాడు.

మంజరి తల పక్కనే ఏదో కాగితం....

నెమ్మదిగా వొణికే చేతుల్తో ఆ కాగితాన్ని తీసి మడతవిప్పి, కొవ్వొత్తి వెలుగులో చదివేడు కృష్ణమూర్తి....

కృష్ణా!

నాకు తెలుసు. నువ్వు నన్ను విపరీతంగా ప్రేమించేవు....కాని.... నాకు అర్హతలేదు. ఉండేదేమో గానీ, ఇప్పుడు లేదు. నాకుచె య్యిలేదు, అందుకే నీ జీవితాన్ని చూస్తూ చూస్తూ నాశనం చెయ్యలేను. నువ్వు నన్ను కోరినా, నా వల్ల సుఖపడలేవు. ఈ భయంకరమైన పరిస్థితుల్లో, నే నెవర్నీ సుఖపెట్టలేను. అందుకే వెళ్ళిపోతున్నాను....ఈ చీకటి రాత్రి నిన్ను....

నీ మనసునీ....నాలుగు రోజులక్రితం నువ్వు నా నుదుటి మీద పెట్టు కున్న ముద్దుని చివరిసారి జ్ఞాపకం తెచ్చుకుని వెళ్ళిపోతున్నాను.

నా తరవాత మరో తమ్ముడూ ఇద్దరు చెల్లెళ్ళూ వున్నారు. అంచేత నేను లేకపోతే మా అమ్మకీ, నాన్నకీ ఎక్కువ బాధ వుండదను కుంటాను. నీకు తగిన అమ్మాయిని ఎంచుకుని సుఖపడు కృష్ణా! వీలుంటే అమ్మకీ నాన్నకీ, ధైర్యం చెప్పు.

చాలా రోజులు ఆలోచించేను గాని, ఈ ఘోరమైన స్థితిలో నే నెవర్నీ సుఖపెట్టలేనని తెలిసి పోయింది కృష్ణా! అందుకే వెళ్ళి పోతు న్నాను. ఇరవై నిద్రమాత్రలు అతి కష్టంమీద ఒంటి చేత్తోనే పుచ్చు కున్నాను. అవి తమ బాధ్యత నిర్వర్తిస్తాయనే అనుకుంటాను.

విష్ యూ ది బెస్ట్ అఫ్ లక్.

— మంజరి.

ఉత్తరం చదవడం పూర్తికాగానే మళ్ళీ మంజరివేపు చూసేడు కృష్ణమూర్తి. ఆమె తలకింద వాడి నలిగిన అప్పటి ముద్ద చామంతిపువ్వు రేకలు....అటు ఇటు చెదిరి కొవ్వొత్తి వెలుగులో వింతగా మెరుస్తు న్నాయి.

ఏమీ చెయ్యలేక బైటకి వచ్చేశాడు కృష్ణమూర్తి.

ఇంకా వీధి చీకటిగానే వుంది. చీకటి రాత్రులవడంవల్ల వెన్నెల లేదు. ఇంట్లోకి బరువుగా ఏమీ ఆలోచించలేక వచ్చిన కృష్ణమూర్తి గుమ్మం దగ్గిరే ఆగిపోయేడు.

ఇంట్లో అంతా అతి చీకటిగా వుంది. ఎక్కడా వెలుగన్నదిలేదు. లోపలికి వెళ్ళిన కృష్ణమూర్తి వాకిట్లోనే నేలమీద ఎవరో అస్పష్టంగా పడుకుని కనిపిస్తున్నారు. అప్పటిదాకా అతని మనసులో మసగ్గా చెదిరి కదిలిన మంజరి జ్ఞాపకాలు ఒక్కసారిగా చెదిరేయి. అప్పటిదాకా అతని నరాల్లో నలుగుతున్న నల్లని భావాలు నలిగి పగిలేయి.

మోకాళ్ళమీద వొంగి అతను ఆ ఆకారాన్ని పరీక్షగా చూసేడు.

అమ్మ....

వెంటనే గదిలోకివెళ్ళి అగ్గిపెట్టి, కొవ్వొత్తి తెచ్చి కొవ్వొత్తి వెలిగించేడు.

"అమ్మా !" అని తట్టి లేపేడు. ఆవిడలేస్తే గుండెల్ని కొరికే మంటలు కొంచెమైనా ఆరుతాయని అనుకున్నాడు. కాని ఆవిడ లేవలేదు. కొవ్వొత్తి వెలుగులో ఆవిడ ముఖం నిర్జీవంగా మెరుస్తోంది.

ఆవిడ పిడికిట్లోంచి ఏదో కాగితం సగం నలిగి తొంగి చూస్తోంది.

కృష్ణమూర్తి మనసు భయంకరమైన మంటల్లో కాలిపోతోంది. ఆలోచనలు అదుపు లేకుండా అలుక్కుని చెదిరిపోతున్నాయి.

భయంగా వొణుకుతూ ఆవిడ చేతిలోంచి ఆ కాగితాన్ని తీసి కొవ్వొత్తి వెలుగులో మడత విప్పేడు.

అమ్మకీ, అన్నయ్యకీ—

ఏం రాద్దామన్నా ముఖం చెల్లడంలేదు. కాని ఆఖరి ఉత్తరం కనక రాయడం తప్పదు.

మీరిద్దరూ చాలా మంచివాళ్ళు. నన్నింతదాన్ని చేసేరు. కాని మీ ఇద్దరికీ నేను ద్రోహం చేసేను. నన్ను క్షమించరని తెలుసు....

ఏమిటి రాయడం....చీకట్లో తప్పు చేసేను. ఆ తప్పుకి శిక్ష నాతో బాటు మీరూ అనుభవించడం నాకు ఇష్టంలేదు. చాలా కష్టంగా వుంటుంది.

మరో నాలుగు నెల్లు బతికుంటే నేను పెళ్ళి కాకుండానే తల్లి నౌతాను. అందుకే మీ ఇద్దరి దగ్గరా వుండలేను. వెళ్ళిపోతాను. బహుశా మీ దగ్గర్నుంచే కాదు, ఈ ప్రపంచంనుంచే వెళ్ళిపోతాను.

మిమ్మల్ని క్షమించమని అడగను. నన్ను మర్చిపోండి, ఒక వెచ్చని నిట్టూర్పైనా నా కోసం వది ల్తే....చాలుననుకునే....

— కమల.

కొవ్వొత్తి కాంతి ఎందుకోగాని ఎక్కువైంది. ఉత్తరం చదివేక కృష్ణమూర్తి వాళ్ళమ్మగారివేపు చూసేడు. ఆవిడ ముఖం చాలా బాధతోనూ, విచారంతోనూ వుంది. ఆవిడ పక్కనే కొంచెం దూరంలో కింద పగిలిన కళ్ళజోడుంది. ఆ వుత్తరం చదవగానే ఆవిడ మనసులో ఆలోచనల మధ్య ఏ అగ్ని పర్వతాలు పగిలేయో, ఆవిడ మెదడులో ఏ నరాలు నలిగి నలిగి కాలిపోయేయో,—వూహించుకోడానిక్కూడా అతనికి భయం వేసింది. అతనెవరో, ఎక్కడున్నాడో, ఏమిటో అంతా మర్చిపోయి ఒక్కసారిగా ఆవిడ శరీరం మీదకి 'అమ్మా' — అని అరుస్తూ వాలి పోయేడు. ఓ రెండు సెకండ్లలోనే పైనించి పెద్ద గాలివేసి కొవ్వొత్తి ఆరిపోయింది.

కాస్సేపయాక ఎందుకోగాని లేచి అతని గదిలోకి నడవలేనట్టుగా భయంగా నడిచి వెళ్ళేడు. అతని కళ్ళు మళ్ళీ ఒక్కసారిగా ఏకధారగా కన్నీళ్ళు కార్చేయి.

కిటికీ దగ్గిరికి వెళ్ళి నిలబడ్డాడు కృష్ణమూర్తి.

అతని మనసంతా మరీ భరించలేని ఆలోచనల మంటల్లో మాడి పోయింది. అక్కడ నిలబడి అతను శూన్యంలోకి చూస్తూ నిలబడి పోయేడు. అతనికేదో భయంకరమైన నిజం తెలిసినట్టయింది. అలా తెలిసేక చీకటిని ప్రేమించినంతగానూ, తను ప్రేమించిన మంజరీ,

చీకట్లో గుండె ఆగి చచ్చిపోయిన వాళ్ళమ్మగారూ, చీకట్లో కాలుజారిన కమలా - వాళ్ళంతా చీకటిలోనే చివరిసారి అన్నట్టుగా కదిలేరు....

అతని హృదయం చీకటిని తల్చుకుని, తలెత్తలేని ఆలోచనల్తో బాటు సొమ్మసిల్లింది.

గదినిండా వెలుగులేని చిక్కని చీకటి భయంకరమైన బాధలా పరుచుకుని వుంది.

□□